# పడగ నీడలో

చలికాలం కావడం వల్ల ఆరుగంటలకే చీకటి పడిపోతూ వుంది.

పేవ్‌మెంట్ మీద మూడొంతులు దుకాణాలతో నిండిపోగా మిగిలిన కాస్త స్థలంలో జనం సినిమా హాల్లో క్యూలా తోసుకుంటున్నారు. ఆడవాళ్ళయితే యిబ్బందిగా పక్కలకు ఒదిగిపోతూ అడుగులు వేస్తున్నారు. సరితకు ఆ పద్మ వ్యూహంలో ఛేదించుకుని పోవడం బాగా అలవాటైపోయింది.

బస్‌స్టాప్ దగ్గరకు చేరి నిల్చుంది సరిత. బస్సులు కిట కిటలాడుతున్నాయి. జనం డోర్ దగ్గర వ్రేలాడుతున్నారు. కొన్ని బస్సులు అసలు ఆగటం లేదు. మరికొన్ని ఆగినట్లు ఆగి వెంటనే పరిగెత్తుతున్నాయి

నిల్చుని నిల్చుని సరిత కాళ్లు పీక్కుపోసాగాయి.

బస్ కోసం ఎదురు చూడడం, అందులో ప్రయాణం, అప్పుడు కలిగే నరకయాతన, చెవులకు తగిలే అసభ్యపదజాలం, అచ్చోసిన ఆంబోతులు చూడనట్లు నటిస్తూ రాచుకుపోవటం, ఏభై ఏళ్లు దాటిన నాగరీకుల చూపుల తూపులు, ఆమెకు అన్నీ జ్ఞాపకం వచ్చి బస్సు వైరాగ్యం కలిగింది.

ఆమె పరధ్యానంగా రెయిలింగ్స్‌కి ఆనుకుంది. ఆమె మనసు ఎక్కడో వుంది. చూపులు స్థిరంగా నిలవడంలేదు. అప్పుడప్పుడూ తనెక్కవలసిన బస్‌కోసం యాంత్రికంగా తలెత్తి చూస్తోంది.

ఆ రోజు ఆమె ఆఫీసు నుంచి గంటలేటుగా బైటపడింది.

"నీకు లేటయినట్లుంది గదా! నేను డ్రాప్ చెయ్యనా?" అని గూడా అన్నాడు ఆఫీసర్‌గారు.

"ఫరవాలేదు సార్. బస్సులో వెళ్ళిపోతాను" అంది.

ఆఫీసరుగారు కారులో వెళ్ళిపోయాడు.

బస్సులో వెళ్ళడానికి సంశయించి ఆయనతో పాటు కారులో వెళ్తే రేపు జరుగబోయే పరిణామాలను ఎదుర్కోవడం కష్టం. కొలీగ్స్ ఎవరొకరు కనిపెట్టకపోరు. లేనిపోని సంబంధాలు అంటగట్టి ఆనందిస్తుంటారు. వాళ్ళకా అవకాశం ఇవ్వడం ఎందుకు?

◆ ◆ ◆

ఇంతలో దూరంగా యేదో కల్లోలం.

ఆడవాళ్ళ ఆర్తనాదాలు, పిల్లల ఏడుపులు, మగవాళ్ళ కేకల వికృత శబ్దాలు,

హఠాత్తుగా ఎర్రటి మంటలు భయంకరంగా చెలరేగాయి. దుకాణాలు తగులబడుతున్నాయి. కొట్లవాళ్లు షట్టర్లు దించేశారు. జనం మృత్యువు తరుముతున్నవాళ్ళలా పారిపోతున్నారు దిక్కు తెలియకుండా, బస్సులు, ఆటోలు, రిక్షాలు ఎక్కడా ఆగకుండా రెక్కలు కట్టుకున్నట్లు ఎగిరిపోతున్నాయి.

సరితకు వణుకు పుట్టింది.

ఏం జరిగింది?

ఏమిటీ అల్లకల్లోలం?

చెప్పేవాళ్ళే లేరు. అసలు నేలమీద నిలబడేవాళ్ళే లేరు. గాలిలో తేలిపోతునాన్నట్లు పారిపోతున్నారు. ఆమె అతికష్టం మీద ఒక యువతిని ఆపి కేక పెట్టింది "ఏం జరిగింది?" అని.

ఆమె రొప్పుతూ "ఒక హిందూ యువకుడు, ముస్లిం కుర్రాణ్ణి పొడిచాడట. అక్కడ కొట్టుకుచస్తున్నారు. పెద్ద గొడవ జరుగుతోంది. కనిపించిన వాళ్ళనల్లా పొడుస్తున్నారు. పారిపోండి" అంది.

ఆ యువతి కళ్ళల్లో విపరీతమైన భయం సుళ్ళు తిరుగుతోంది. అదురుతున్న శరీరాన్ని అదుపులోకి తీసుకుని పరుగుతీసింది.

సరిత గుండె భయంతో వణికింది. నరనరాల్లో భయం పరవళ్ళు తొక్కుతోంది.

తను అక్కడ్నుంచి బైటపడడం ఎలా?

'ఓ భగవాన్. నన్నీ గండం నుంచి బైటపడేయ్. నా కోసం ఒక ఆటో, కనీసం ఒక రిక్షా అయినా సరే ఆపించు' ఆమె భగవంతుణ్ణి ప్రార్థించింది.

క్షణాలు భయంకరంగా గడుస్తున్నాయి. నిర్మానుష్యమైన ఆ పరిసరాలు జుగుప్సాకరంగా కనిపిస్తున్నాయి.

దూరంగా భయంకర శబ్దాలు వినిపిస్తున్నాయి. రాను రాను ఆ శబ్దాలు చెవులకు చిల్లులు పొడుస్తున్నాయి.

సరిత పరిగెత్తి, పరిగెత్తి మెయిన్‌రోడ్ దాటి ఒక వీధిలోక తిరిగింది. శక్తి కొద్దీ ఎంతదూరం పరుగుతీసిందో ఆమెకే తెలీదు. ఆ వీధి అంతా నిర్మానుష్యంగా వుంది. న్యూట్రాన్ బాంబ్ ప్రేలి జనం నశించిపోయినట్లు ఒక జీవి గూడా కనిపించడంలేదు. ఇళ్ళ తలుపులన్నీ మూసి వున్నాయి.

'తను ఇంటికి ఎలా చేరాలి?'

'సురక్షితంగా చేరుతుందా?'

'ఈ రాత్రి తెల్లవారుతుందా?'

'దేవుడా నాకు దారి చూపు.'

సరిత మనసు ఆక్రోశిస్తోంది. గమ్యం తెలియని బాటసారిలా రొప్పుతూ పరుగుతీస్తోంది.

కొంచెం సేపటికి తల తిరుగుతుంటే ఆగింది. అయాసం తీర్చుకుంటోంది. ముఖానికి పట్టినచెమట తుడుచుకుంది.

"పకడో...!" అనే కేక భయంకరంగా కత్తిలా వచ్చి ఆమె చెవులకు తాకింది.

ఆమె గుండె అదిరి వెనక్కు తిరిగి చూసింది.

ఇద్దరు యువకులు తన వైపే వస్తున్నారు. వాళ్ళ పిల్లిగడ్డాలు చూసి ముసల్మాన్ కుర్రాళ్ళని గ్రహించింది.

ఆమె భయ విహ్వలతతో, వణుకుతూ పరుగుతీసింది. వాళ్ళూ వెంటపడ్డారు.

తల తిరుగుతోంది. కళ్లముందు చీకట్లు క్రమ్ముకుంటున్నాయి.

'తను వాళ్ళకి చిక్కితే ఏముంది? సర్వనాశనం. అలా జరక్కూడదు.'

'ఓ భూదేవీ రెండుగా చీలిపోయి నన్ను నీలో కలుపుకో తల్లీ!' అని ఆమె హృదయం, మనసు, భూదేవిని ప్రార్థించాయి.

త్రాచుపాము వెంటపడిన కప్పలా వుంది ఆమె పరిస్థితి. పడగ నీడలో వున్నట్లు, ఏ క్షణంలో కాటు తనని కబళిస్తుందో అన్నట్లు ఆమె వణికిపోతోంది.

చావు భయంతో పారిపోతున్న ఆమె ఒక గల్లీలోకి తిరిగింది. ఒక యింటి తలుపులు ఓరగా తీసి వున్నాయి. లోపల్నుంచి వెలుగువస్తోంది.

'జి. రామారావు, బి.ఏ., బి.యల్, అడ్వొకెట్' అనే నేమ్ బోర్డు చూసి ఏమీ ఆలోచించకుండా ఆ ఇంట్లోకి దూరి తలుపులు మూసివేసి, వాటికి ఆనుకుని రొప్పుతూ నిల్చుంది. బరువైన వూపిరి చప్పుడు ఆమెకే వినబడుతోంది. ఆమె వక్షం కిందకీ పైకీ లేస్తోంది ముఖం మీద చెమట ధారలు కట్టి కారుతోంది.

ఇంట్లో అలికిడిలేదు. ఎవరైనా వున్నారో లేదో కూడా తెలియడం లేదు. కాలం కదలకుండా ఆగిపోయినట్లుగా వుంది.

ఆమె కళ్ళెత్తి ఆ గదిని పరిశీలనగా చూసింది. ఆ గదికి గోడలు లేనట్లుగా, పుస్తకాల బీరువాలే గోడలుగా వున్నాయి. వాటినిండా లావు బైండ్ పుస్తకాలు పేర్చబడ్డాయి గది మధ్యలో ఉన్న వెడల్పాటి టేబుల్ మీద పుస్తకాలు. ఫైళ్ళు దొంతరలుగా కనిపిస్తున్నాయి. ఆ టేబుల్ చుట్టూ కుర్చీలున్నాయి. ఆ గదిలోనే ఒక మూల సోఫా వుంది. పైన సీలింగ్ ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతోంది.

లాయర్‌గారు ఇప్పటి వరకూ అక్కడే కూర్చుని వుండి వుండాలని ఆమెకు తోచింది. తను రావడానికి కొంచెముందు ఆయన ఇంట్లోకి వెళ్ళివుండొచ్చు అనుకుంది. ఆయన్ని పిలవాలా? లేక ఈ గదిలోకి వచ్చే వరకూ వేచి వుండాలా? అని ఆమె లోలోపలే తర్జన భర్జన పడుతోంది.

ఆమె ఎటూ తేల్చుకోక ముందే లాయరుగారు ఆ గదిలోకి వచ్చేసి తన సీట్లో కూర్చుండిపోయాడు.

తలెత్తి చూసేసరికి ఆమె కనిపించింది. ఆమె ఎప్పుడు వచ్చిందో అర్థంకాక కొన్ని క్షణాలు నివ్వెరపోయాడు తర్వాత పరిశీలనగా చూశాడు.

ఆమె ఎవరో అపరిచిత. వయస్సు ఇరవై పాతికేళ్ళ మధ్య వుండొచ్చు. కోల ముఖం, కోటేరు ముక్కు, నడుం దగ్గర సన్నగా, శరీరం పచ్చగా, అందంగా శిల్పంలా నిగనిగలాడుతోంది. అరవిచ్చిన ముద్దబంతి పువ్వులా ఆకర్షణీయంగా చూసిన కొద్దీ చూడాలనిపించేటట్లుగా వుందామె.

కాని అతని సంస్కారం హెచ్చరించగా కళ్ళు తిప్పుకొని "రండి... రండి" అన్నాడు.

ఆమె ముఖం కర్చీఫ్‌తో తుడుచుకొని కొంచెం స్వాంతన పొంది నెమ్మదిగా అడుగులు వేసింది.

"కూర్చోండి" అన్నాడు ఆమె కూర్చుంది.

"చెప్పండి ఏమిటి మీ కేసు?" ప్రశ్నించాడు.

"నాకు ఏ కేసూ లేదండీ" అతికష్టం మీద పెదవులు కదిల్చింది ఆమె.

లాయర్ కొంచెం ఆశ్చర్యపోయినట్లు కనిపించాడు. ఏ కేసూ లేని ఆమె తన దగ్గరకు వచ్చినట్లు అనుకుని అతను పెదవి విప్పబోతూ ఉండగా సరిత తన కథంతా వివరంగా చెప్పింది.

ఆమె ఏ పరిస్థితిలో ఆ ఇంట్లోకి అడుగు పెట్టిందో విని అతను నిట్టూర్చాడు.

"స్వార్థపరులు ఇటువంటి మత కలహాలు సృష్టిస్తూ తమ పబ్బం గడుపుకుంటుంటారు. ఏమీ ఎరుగని అమాయకులు యీ మారణహోమంలో బలైపోతుంటారు" అతని కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"ఈ ఏరియాలో ఇటువంటి గొడవలు ఎక్కువ. ఇక్కడి ముస్లిం గూండాలను చూస్తే నాకు గుండె దడ పుడుతుంది. చీటికి మాటికి తగాదాలు పెట్టుకొని దారుణంగా ప్రవర్తిస్తుంటారు" ఆమె వాళ్ళని ఘాటైన పద

జాలంతో తిట్టింది.

"అటువంటి వాళ్ళు హిందువుల్లో గూడా వుంటారు. మనం ఎవర్నీ ఏమీ క్రిటిసైజ్ చేసే స్థితిలో లేం. చూస్తూ కుమిలిపోవడం తప్ప" అన్నా డతను.

"సార్! రామారావు గారూ! ముస్లిం గూండాలు మరీ రాక్షసంగా చర్చిస్తుంటారు సార్! నేను కళ్ళారా చూశాను ఒకసారి. ఈ మతం గొడవల్ని ఆసరాగా తీసుకుని నా ఫ్రెండ్ వుండేదిలెండి సీత అని. దాన్ని నలుగురు పట్టుకెళ్ళి దారుణంగా చెరిచి చంపేశారు" ఆమె గొంతు గాద్గదికమై కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఇప్పుడవన్నీ తల్చుకుని బాధపడకండి. మనవాళ్ళంతి కరువై నిద్ర గూడా పట్టదు" అన్నాడతను.

ఆమె మౌనంగా కళ్ళు తుడుచుకుంది.

"మీ రెక్కడ వుంటున్నారు?" ప్రశ్నించాడు.

"సనత్ నగర."

"రోజూ అంత దూరం నుంచి వస్తుంటారా?"

"ఊ..." అందామె.

"దగ్గర్లో ఇల్లు దొరకలేదా?"

"ట్రై చేస్తే దొరుకుతుందేమో? కాని ఈ ఏరియాలో వుండడం నా కిష్టంలేదు. ఇక్కడ ముస్లింలు ఎక్కువసార్. నాకు భయం వాళ్ళ వ్యవహారం చూస్తే, నేను మా అమ్మ తప్ప మగదిక్కు లేదు మాకు."

అతను నవ్వి, "అలా అనుకుంటే ఎలా? మంచివాళ్ళు ముస్లింలలో గూడా వుంటారు. చెడ్డవాళ్ళు హిందువుల్లో గూడా వుంటారు. మరి ఈ ఏరియాలో ఉద్యోగం ఎలా చేస్తున్నారు?" అన్నాడు.

"గత్యంతరం లేదు కదండీ మరి?" అంది సరిత.

"ఈ రాత్రి మీరు ఇల్లు చేరడం కష్టమే" అన్నాడు అతను. గోడ గడియారం ఎనిమిదిన్నర చూపిస్తోంది.

ఆమె అతనివంక చూసి కళ్ళు దించుకుంది.

"రండి ఫలహారం చేద్దాం."

"వద్దండి ఆకలిగా లేదు" ఇబ్బందిగా చూస్తూ మొగమాటపడుతూ అంది సరిత.

"భలేవారే మీరు! ఈ టైమ్‌లో ఆకలి లేకపోవడం ఏమిటి? రండి ఫరవాలేదు. రాత్రిపూట భోజనం చేసే అలవాటు లేదు నాకు. చపాతీ తింటాను."

"ఇంట్లో ఎవరూ వున్నట్లు లేరే"

"అవునండి అంతా తిరుపతి వెళ్ళారు"

"మీ కోసం కొద్దిగా చేసుకుని వుంటారు. అందులో నేను భాగం తీసుకోవడం ఇష్టంలేదు"

"అందుకని ఆకలితో ఈ రాత్రంతా బాధపడతారా? నాకు బాగా అనుభవం ఆకలిమంట ఉన్నదాన్నే సర్దుకుందాం ఇంతకీ మీ పేరు అడగనేలేదు నేను"

"సరిత"

"గుడ్ నేమ్" మెచ్చుకున్నాడు.

ఆమె బిడియపడుతూనే కుర్చీలోంచి లేచింది. అతను బాత్‌రూమ్ చూపించాడు. సబ్బుతో ముఖము కడుక్కుంది. చపాతి తిన్నాక రెండుఅరటి పళ్ళు ఇచ్చాడు-ఆమెకు భోజనము చేసినంత తృప్తి కలిగింది-

తర్వాత ఆమెకు బెడ్‌రూమ్ చూపించాడు,

"మీరు ?"

"నేను సోఫాలో పడుకుంటాలెండి" అన్నాడు-

ఆమె బెడ్‌రూమ్ తలుపులు మూసి బోల్టు వేసుకొంది, పడుకున్నాక చాలా సేపు నిద్రపట్టలేదు, జరిగిందంతా తల్చుకుంటే కలా? నిజమా? అనిపిస్తోంది-తను చాలా అదృష్టవంతురాలు, నిజంగా లాయరుగారు ఎంత మంచివాడు, తనపేరు సార్థకము చేసుకున్నాడు, లేకపోతే ఈ రోజుల్లో ఒంటరి

ఆడదాన్ని గౌరవించేవాళ్ళ ఎంతమంది? ఇటువంటి మంచివాళ్ళు నూటికీ, కోటికీ వుంటారు-

* *

ఆమెకు మెలకువ వచ్చేసరికి సూర్యోదయమైంది. హడావుడిగా లేచి తలుపు తీసింది.

లాయర్‌గారు అప్పటికే లేచి స్నానముచేసి ఫ్రెష్‌గా కనిపించాడు, "లా" పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు.

ఆమెను చూడగానే "గుడ్‌మార్నింగ్ సరితగారూ" అన్నాడు

ఆమె గుడ్‌మార్నింగ్ చెప్పింది-

"మీరు స్నానం చెయ్యండి, బాయిలర్‌లో వేడినీళ్ళు రెడీగా వున్నాయి" అన్నాడు.

"ఎలావుంది అల్లర్ల పరిస్థితి?" ఆదుర్దాగా అడిగింది.

"అదుపులోనే వుందని రేడియోలో చెప్పారు, పోలీసులతో పాటు రిజర్వ్ పోలీసులు తుపాకీలు పట్టుకుని గస్తీ తిరుగుతున్నారట, అవసరము ఐతే షూట్ చెయ్యమని ఆర్డర్స్ వేశారట, అంతగా ఐతే కర్ఫ్యూ పెడతారట" అతను వివరముగా చెప్పాడు—

"నేనెలాగైనా ఇంటికి వెళ్ళిపోవాలండీ, నేను రాత్రి వెళ్ళక పోయేసరికి మా అమ్మ ఎంత గాభరా పడుతున్నదో. అసలే జబ్బు మనిషి" అంది సరిత ఆందోళనా పూరితమైన స్వరంతో.

"అలాగే వెళ్దురు గాని ముందు స్నానం చేసి రండి భయపడకండి ఇక ఏమీ ఫరవాలేదు నేను మెయిన్ రోడ్డు వరకూ తోడుగా వచ్చి ఆటో ఎక్కించి పంపుతాను. సరేనా?" అని నవ్వాడు.

"మీరు దేవుడిలా నన్ను కాపాడారు. నాకు ఇక ఏమీ భయం లేదు లెండి" అంది సరిత.

తర్వాత స్నానం చేసి వచ్చింది.

అతను వేడి వేడి "టీ" కప్పు అందించాడు.

"థాంక్స్. మీకు చాలా ఋణపడిపోతున్నాను" అని నవ్వుతూ "టీ" కప్పు అందుకుంది.

"భలే వారే మీరు. నన్ను అతిగా పొగుడుతున్నారు" అన్నాడు.

ఇద్దరూ మెయిన్‌రోడ్ దగ్గరకు వచ్చారు. పావుగంట తరువాత ఒక ఆటో దొరికింది మీటర్ మీద రెండు రూపాయలు అదనంగా ఇవ్వాలన్నాడు సరిత అలాగే యిస్తానని ఒప్పుకుంది

"నమస్తే రామారావుగారూ! మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. నే నెప్పుడయినా కోర్టు కేసుల్లో ఇరుక్కుంటే మిమ్మల్నే నా లాయర్‌గా పెట్టుకుంటా లెండి" అంది నవ్వుతూ.

"అలాగే! కాని ఒక విషయం."

"ఏమిటి?"

"నా పేరు రామారావు కాదు" నవ్వాడు.

ఆమె దిమ్మతిరిగినట్లయిపోయింది కొన్ని క్షణాలు. తర్వాత నెమ్మదిగా తేరుకుంది.

"మరి మీ పేరేమిటి?"

"అబ్దుల్ హసన్" మృదువుగా చెప్పాడు.

ఆమె ఆశ్చర్యానికి అంతులేదు-

"మీ యింటిదగ్గర నేమ్‌బోర్డు ?"

"అది మా ఇల్లుకాదు-రామారావుగారిదే, నేను ఆయన దగ్గర జూనియర్ని. నాకింకా పెళ్ళికాలేదు, వారింట్లోనే వుంటాను, మా నాన్న! ఆయనా ప్రాణస్నేహితులు."

అతను ఆమెకళ్ళకి మనిషిలా కాదు, దేవుడిలా కనిపిస్తున్నాడు. *

ప్రచురణ : విజయ, మే, 1983